సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 30 । జనవరి । 2024




కీచక హెచ్ఎంకి దేహశుద్ధి
చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న ప్రధానోపాధ్యాయుడికి తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు.
8లో ▸



హ్యాండ్‌బాల్ విజేత 'పశ్చిమ'
రాష్ట్రస్థాయి అండర్–19 హ్యాండ్‌బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది.
8లో ▸

విశేష అలంకరణ
పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి పంచహారతులు కార్యక్రమం నిర్వహించారు.



న్యూస్‌రీల్

జిల్లా ఎస్పీగా అజితా వెజెండ్లా



సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా అజితా వెజెండ్లా నియమితులయ్యారు. 2015 బ్యాచ్‌కు చెందిన ఆమె ప్రస్తుతం జగ్గయ్యపేట డీసీపీగా సేవలందిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఇప్పటివరకు జిల్లా ఎస్పీగా విధులు నిర్వర్తించిన యు.రవి ప్రకాష్ ఏసీబీ ఎస్పీగా బదిలీ అయ్యారు.

ఫిర్యాదులపై సత్వర చర్యలు

భీమవరం: స్పందనలో ఫిర్యాదులపై చట్టప్రకారం విచారణచేసి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ యు.రవిప్రకాష్ పోలీసు అధికారులను ఫోన్‌లో ఆదేశించారు. సోమవారం భీమవరం డీఎస్పీ కార్యాలయంలో క్రైమ్ డీఎస్పీ బి.పైడేశ్వరరావుతో కలిసి స్పందన ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 18 ఫిర్యాదులు అందగా వాటిలో వరకట్నం వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉన్నాయి.

జిల్లాస్థాయి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు ఏర్పాట్లు

భీమవరం: జిల్లాస్థాయిలో ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల నిర్వహణకు సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 31న జరిగే జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఆటల నిర్వహణకు అనువైన మైదానం గుర్తించి పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు వివిధ ఆటల పోటీల్లో పాల్గొంటారని, వారికి వసతి, భోజన సదుపాయాలు కల్పించడంలో లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ఆర్డీఓ కె.శ్రీనివాసులురాజు, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డీఎల్‌డీఓ అప్పారావు, ఎంపీడీఓ వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ విద్యలో ఉత్తీర్ణత తప్పనిసరి

భీమవరం: ఇంటర్మీడియెట్ విద్యార్థులు మానవ విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు ఉత్తీర్ణులైతేనే పాస్ సర్టిఫికెట్ జారీ చేస్తారని ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రాంతీయ ఇన్‌స్పెక్షన్ అధికారి (ఆర్ఐఓ) కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక గ్రంధి వెంకటేశ్వరరావు జూనియర్ కళాశాలలో త్వరలో జరిగే ఇంటర్ పరీక్షలకు సంబంధించి నైతికత, మానవ విలువలు, పర్యావరణ విద్యపరీక్షలు, ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 2న నైతికత, మానవ విలువలు పరీక్ష, ఫిబ్రవరి 3న పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తారన్నారు. విద్యార్థి చదువుతున్న కళాశాలలోనే ఈ పరీక్షలు రాయాల్సి ఉంటుందన్నారు. జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి కేవీ సత్యనారాయణ, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు ఎం.నర్సింహమూర్తి, ఎ.రాజ్‌కృష్ణ, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

భీమవరం: టెన్త్ పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానం నిలిపేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల, డివిజన్ స్థాయి విద్యాశాఖాధికారులతో టెన్త్ పరీక్షా ఫలితాలు, నాడు-నేడు పనులపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించాలని, నాడు–నేడు పనులకు సంబంధించి నిధులు ఉంటే మిగతా పనులు పూర్తిచేయాలన్నారు. డీఈఓ ఆర్.వెంకటరమణ, విద్యాశాఖ సహాయ సంచాలకులు ఎన్.సత్యనారాయణ, డీవైఈఓలు, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎన్వీ రమణ, ఎస్వీ రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.407 కోట్లతో 'జలజీవన్' పనులు

భీమవరం (ప్రకాశంచౌక్): జలజీవన్ మిషన్ పనులను వేగిరపర్చాలని కలెక్టరేట్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాలో చేపట్టిన జేజేఎం పనుల ప్రగతిపై సమీక్షించారు. జిల్లాలో రూ.407 కోట్ల అంచనా వ్యయంతో 1,474 పనులను జేజేఎం కింద కేటాయించగా ఇప్పటికే 557 పనులు పూర్తయ్యాయని, మరిన్ని పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. 338 పనులను కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ సిస్టం ద్వారా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు.

గృహోత్తరం.. ప్రగతి పథం

రాష్ట్రంలో పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహయజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు గృహనిర్మాణాలకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహిస్తున్నారు. దీంతో జగనన్న కాలనీల రూపంలో కొత్త ఊళ్లు పుట్టుకొస్తున్నాయి. సకల వసతులతో జగనన్న లేఅవుట్‌లలో ఇళ్లు సర్వాంగ సుందరంగా ముస్తాబవుతూ అభివృద్ధికి అద్దం పడుతున్నాయి.

ఉద్యమంలా ఇళ్ల నిర్మాణం

- పేదల సొంతింటి కల సాకారం
- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు
- ఉమ్మడి జిల్లాలో 1.70 లక్షలకు పైగా గృహాల మంజూరు
- ఇప్పటివరకు రూ.1,813 కోట్ల వ్యయం



ఏలూరు(మెట్రో): సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రజల అభివృద్ధికి పట్టం కడుతున్న రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకాన్ని ఉద్యమంలా చేపట్టింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 1.70 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసి పేదల కల సాకారం చేస్తోంది. ఏలూరు జిల్లాలో 98,874 గృహాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 72,059 గృహాలు మంజూరు చేసింది. వీటిలో ఏలూరు జిల్లాలో 29,500 ఇళ్లు పూర్తికాగా 69,374 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి. వీటికి సుమారు రూ.1,000 కోట్ల నిధులను ప్రభుత్వం వెచ్చించింది. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 45,011 ఇళ్లు వివిధ దశల్లో ఉండగా, 27,048 గృహనిర్మాణాలు పూర్తయ్యాయి. వీటి కోసం ప్రభుత్వం రూ.813 కోట్లు వెచ్చించింది. అత్యాధునిక వసతులతో టౌన్‌షిప్‌లను తలపిస్తూ గృహనిర్మాణాలు సాగుతున్నాయి. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల పథకం ప్రజల పాలిట వరంగా మారింది. దీంతో లబ్ధిదారులంతా సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



ఉంగుటూరు మండలంలోని బొమ్మిడి లేఅవుట్‌లో ఇళ్లు

గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతివారం సమీక్షలు, రోజూ ఇళ్ల నిర్మాణాల పరిశీలన వంటివి చేస్తూ గృహనిర్మాణాలు ప్రోత్సహిస్తూ పేదలు సొంతింటిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. హౌసింగ్ అధికారులు నేరుగా లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఎప్పటికప్పుడు నిర్మాణాలు పూర్తిచేసేలా ప్రోత్సహిస్తున్నారు. అన్ని వసతులతో నూతన గృహాలను అందిస్తున్నాం.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు



జగనన్న చలవతో..

సొంతింటి కోసం చాలా ఏళ్లు పడిగాపులు పడ్డాం. ఇన్నేళ్లకు ఆ నిరీక్షణకు తెరపడింది. గత ప్రభుత్వాల పాలనలో దరఖాస్తులు చేసుకున్నా ఫలితం లేదు. జగనన్న ప్రభుత్వంలో మాకు కేటాయించిన స్థలంలో సొంతిల్లు కట్టుకుని జీవనం సాగిస్తున్నాం. జగనన్న చలవతోనే మాకు గృహ సంతృప్తి కలిగింది. జగనన్న చేసిన మేలు జీవితాంతం మరువలేం.

– పెదపూడి పార్వతి ఫణికుమారి, ఏలూరు



రుణపడి ఉంటాం

జగనన్న ప్రభుత్వ పాలనలోనే సొంతింటి కల సాకారమైంది. ప్రభుత్వం అందించిన సహాయంతో పాటు అధికారులు సైతం దగ్గరుండి నిర్మాణాన్ని పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకున్నారు. సకల వసతులు కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకున్నారు. జగనన్న ప్రభుత్వానికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– రౌతు ధనలక్ష్మి, శనివారపుపేట, ఏలూరు

ఏళ్ల నాటి కల



సొంతింటి కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నా. జగనన్నతో ఆ కల సాకారమైంది. గతంలో పలుమార్లు ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత మరోమారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే గృహాన్ని మంజూరుచేశారు. అలాగే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయించి గృహప్రవేశం సైతం అధికారులే దగ్గరుండి చేయించారు.

– మడివి వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం

దరఖాస్తు చేసిన వెంటనే..



చాలా కాలం అద్దె ఇంట్లో జీవనం సాగించాం. జగనన్న ప్రభుత్వం రావడంతో సొంతింటికి దరఖాస్తు చేసుకున్నాం. వెంటనే అధికారులు వచ్చి ఆధారాలు పరిశీలించి ఇల్లు మంజూరు చేశారు. జగనన్న పుణ్యమా అని ఇంటి అద్దె కట్టే బాధ తప్పింది. సొంతింట్లో కుటుంబంతో కలిసి ఆనందంగా ఉంటున్నాం. అద్దె డబ్బులు కూడా మిగిలాయి.

– గెద్దాడ దుర్గాభవానీ, శనివారపుపేట, ఏలూరు

'సిద్ధం'కు చురుగ్గా ఏర్పాట్లు

- 3న దెందులూరులో భారీ బహిరంగ సభ
- క్యాడర్‌కు సీఎం జగన్ దిశానిర్దేశం
- ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి లక్షలాది మంది రాక
- ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ మిథున్ రెడ్డి, తలశిల, ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు



సభా వేదికను పరిశీలిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురాం, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ



చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'సిద్ధం' బహిరంగ సభకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వచ్చే నెల 3న ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ క్యాడర్‌కు దిశానిర్దేశం చేసే భారీ బహిరంగ సభావేదిక నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లోని 50 నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు సభకు తరలిరానున్న నేపథ్యంలో విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఫిబ్రవరి 3న మధ్యాహ్నం 2 గంటలకు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించనున్నారు.

ఏర్పాట్ల పరిశీలన : ఏలూరు ఆటోనగర్–దెందులూరు మధ్యలో సహారా సంస్థకు చెందిన 130 ఎకరాల ప్రాంగణంలో సభావేదిక నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సోమవారం పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి, సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజుతో పాటు పార్టీ నేతలు సభా వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.

50 నియోజకవర్గాల నుంచి.. జిల్లా చరిత్రలోని కనీవిని ఎరుగని రీతిలో లక్షలాది మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 19, పశ్చిమగోదావరి జిల్లాలోని 15, కృష్ణా జిల్లాలోని 16 మొత్తంగా 50 నియోజకవర్గాల నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలతో పాటు లక్షల సంఖ్యలో పార్టీ శ్రేణులు 'సిద్ధం' సభకు హాజరుకానున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటివరకు ఆరుకు పైగా పార్కింగ్ ప్రాంతాలు గుర్తించారు. ఆటోనగర్, దెందులూరు ప్రారంభంలో రెండు, ఆశ్రం కాలేజీ వద్ద మరో ప్రాంతాన్ని గుర్తించారు. అలాగే సభావేదిక వెనుక భాగంలో సీఎం హెలీప్యాడ్ పనులు చేపట్టారు. దాదాపు ఎకరాకుపైగా విస్తీర్ణంలో సభావేదికలో కార్యకర్తలకు దగ్గరగా వెళ్లి అభివాదం చేయడానికి వీలుగా సుమారు కిలోమీటరు విస్తీర్ణంతో ప్రత్యేక స్టేజీల ఏర్పాటు పనులు చేస్తున్నారు.

స్పందనలో 226 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలు సంతృప్తి చెందేలా స్పందన అర్జీలు పరిష్కారం ఉండాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారులు సంతృప్తి చెందేలా గడువులోపు పరిష్కరించాలన్నారు. స్పందనలో 226 అర్జీలు స్వీకరించామన్నారు. జేసీ ఎస్.రామసుందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ పాల్గొన్నారు.

ఇద్దరు బీఎల్ఓల సస్పెన్షన్

తాడేపల్లిగూడెం: తుది ఓటర్ల జాబితాలో దొర్లిన తప్పులకు ఇద్దరు బీఎల్ఓలను సస్పెండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాలు ఇచ్చారు. తాడేపల్లిగూడెం వార్డు సచివాలయం నం.20లో విలేజ్ రెవెన్యూ అధికారి గ్రేడ్–2 బీఎల్ఓగా విధుల నిర్వర్తిస్తున్న జి.నిర్మల, పెదతాడేపల్లి సచివాలయం–2 ఇంజనీరింగ్ అసిస్టెంటు బీఎల్ఓగా విధులు నిర్వహిస్తున్న వి.అనూషను సస్పెండ్ చేస్తూ, పూర్తిస్థాయి విచారణకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

37 మత్స్య యూనిట్లకు ఆమోదం

భీమవరం: పీఎం మత్స్య సంపద యోజన పథకంలో రూ.7.23 కోట్ల విలువైన 37 యూనిట్లను రూ.3.05 కోట్ల సబ్సిడీతో లబ్ధిదారులకు అందించేందుకు ఆమోదించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో పీఎంఎంఎస్‌వై పథకంపై నిర్వహించిన జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. మినీ ఫిష్ వెండింగ్ యూనిట్లు 10, మూడు చక్రాల ఈ–రిక్షాలు మూడు, ఐస్ బాక్స్‌తో కూడిన మోటారు సైకిళ్లు 6, ఐసోలేటెడ్ వెహికల్స్ 4, కన్‌స్ట్రక్షన్ ఫిష్ కియోస్క్ 5, లైవ్ ఫిష్ వెండింగ్ సెంటర్స్ 1, ఫిష్ వాల్యూయేటెడ్ ఎంటర్‌ప్రైజస్ యూనిట్లు 4, క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌లు 2, 20 టన్నుల సామర్థ్యం గల ఫీడ్ మిల్స్ 1, 20 టన్నుల సామర్థ్యం గల ఐస్ ప్లాంట్‌ను అందించేందుకు ఆమోదించారు.

ధూపదీప నైవేద్యం పథకానికి వినతి



మంత్రి కొట్టుకు వినతిపత్రం అందిస్తున్న నటుడు ఆర్.నారాయణమూర్తి

తాడేపల్లిగూడెం అర్బన్: తన స్వగ్రామం, కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం మల్లంపేటలో శ్రీరామాలయం, వినాయకుడి ఆలయాలకు ధూపదీప నైవేద్యం పథకాన్ని అమలు చేయాలని సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి సోమవారం డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మంత్రి నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లంపేటలో పరిశీలించి పథకాన్ని మంజూరు చేస్తామని మంత్రి కొట్టు హామీ ఇచ్చారు. నారాయణమూర్తి సోదరుడితోపాటు కర్రి భాస్కర రావు, కె.రామకృష్ణ ఉన్నారు.

సొంతూరి ప్రజలనూ మోసగిస్తున్న ఆరిమిల్లి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సొంత గ్రామ ప్రజలను మోసగిస్తూ అబద్ధాలను ప్రచారం చేస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండపాకలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నిజం మాట్లాడితే అతని తల వెయ్యి ముక్కలయ్యే ప్రమాదం ఉండటంతో ఏనాడు నిజాలు మాట్లాడరని, అదే శాపం తణుకు నియోజకవర్గ టీడీపీ నాయకులకు కూడా తగిలిందన్నారు. ఎన్నికలకు వారం రోజుల ముందు సమాధి రాళ్ల మాదిరిగా పునాది రాళ్లు వేసి ప్రజలను మోసం చేయడం టీడీపీ నాయకులకు అలవాటుగా మారిందన్నారు. టీడీపీ నాయకులు నిజాలు దాచి ఎదుటవారిపై బురద చల్లే ప్రయత్నం చేయడంతో ప్రజలు కష్టాలతో పాటు నష్టపోతున్నారన్నారు. తణుకు మండలం వేల్పూరులో సామాజిక వైద్య కేంద్రం నిర్మాణానికి 2017లో రూ.3 కోట్లు మంజూరు కాగా 2019లో ఎన్నికలకు వారం ముందు శంకుస్థాపన చేశారని విమర్శించారు. వెంటనే పనులు ప్రారంభించి బిల్లులు చెల్లిస్తే అప్పుడే నిర్మాణం పూర్తయ్యేదన్నారు. అయితే కేవలం మట్టి పనులు చేసి ఒక్క రూపాయి కూడా బిల్లులు చెల్లించకపోవడంతో ఈ నిధులు మురిగిపోయాయన్నారు. అనంతరం తాను ఎమ్మెల్యే, మంత్రిగా వేల్పూరులో అందరికీ అందుబాటులో ఉండేలా రూ.6 కోట్లతో 30 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశానన్నారు. అయితే గ్రామంలో మధ్యలో ఉండే స్థలంలో షాపులు నిర్మించాలని పంచాయతీ తీర్మానం చేసినట్లు, అందులో ఆస్పత్రి నిర్మాణం వద్దంటూ పంచాయతీ సభ్యులతో కోర్టులో కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండాలనే ఉద్దేశంతోనే మెయిన్ రోడ్డు పక్కన స్థలంలో శంకుస్థాపన చేశానన్నారు. అయితే ఇక్కడ పంచాయతీ ద్వారా షాపులు కట్టాలని ప్రజలకు అవసరమైన ఆస్పత్రి నిర్మాణాన్ని అడ్డుకోవడం దారుణమన్నారు. గత టీడీపీ పాలనలో కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని, భూగర్భ డ్రైయినేజీ పేరుతో గ్రామాల్లో డ్రైయినేజీ వ్యవస్థను అస్తవ్యస్థం చేశారని చెప్పారు. తన పాలనలో రూ.3 వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని, టీడీపీ హయాంలో ఎంత అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా.. అని ప్రశ్నించారు. వేల్పూరులో బహిరంగ చర్చ పెడదామా? అని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్రా వీరన్న, ఎంపీపీ రుద్ర ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియ పూర్తి

వేల్పూరులో 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి టెండర్లు పిలవకుండానే శంకుస్థాపన చేశారనే ఆరోపణల్లో నిజం లేదని రాష్ట్ర మెడికల్ కార్పొరేషన్ ఈఈ బీవీ గిరి తెలిపారు. ఆస్పత్రి నిర్మాణానికి ఈనెల 9న టెండర్ల ప్రక్రియ ముగిసిందని, కొందరు పంచాయతీ సభ్యులు కోర్టు రిట్ పిటీషన్ వేయడంతో టెండర్లు తెరవలేదని చెప్పారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా రోప్ స్కిప్పింగ్ పోటీలు



భీమవరంలో రోప్ స్కిప్పింగ్ పోటీల దృశ్యం

భీమవరం: అంతర్ జిల్లా 67వ స్కూల్ గేమ్స్ అండర్–14, –17, –19 బాలబాలికల రోప్ స్కిప్పింగ్ టోర్నమెంట్, ఎంపిక పోటీలు పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎం హైస్కూల్ ఆవరణలో రెండు రోజులుగా ఉత్సాహంగా సాగుతున్నాయి. సోమవారం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా రోప్‌స్కిప్పింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి జీసీపీ శేఖర్ రాజు, పీఈటీ బీవీ రామభద్రరాజు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి క్రీడాకారుడి వ్యక్తిగత ఫలితాలను నమోదు చేస్తున్నారు. పోటీల తుది ఫలితాలను మంగళవారం వెల్లడించనున్నారు.

రైల్వేస్టేషన్‌లో మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్టు



మద్యం బాటిళ్లు, నిందితుడితో పోలీసులు

తాడేపల్లిగూడెం: పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి వద్ద నుంచి రూ.28,560 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తాడేపల్లిగూడెం రైల్వే ఎస్‌ఐ జి.శ్రీహరిబాబు చెప్పారు. విజయవాడ రైల్వే ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ ఉత్తర్వులు మేరకు తాడేపల్లి గూడెం రైల్వే స్టేషన్‌లో సోమవారం తనిఖీలు చేస్తుండగా ప్లాట్‌ఫారం–2లో సాయినగర్–శిరిడి ఎక్స్‌ప్రెస్ నుంచి దిగిన ఓ వ్యక్తి బద్ది రెడ్డి సూరిబాబుకు చెందిన బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో 36 విస్కీ, బ్రాందీ బాటిల్స్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కీచక ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి



అత్తిలిలో ధర్నా చేస్తున్న బాధిత తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ



తణుకు ఆస్పత్రిలో డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్‌తో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

- విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులతో తల్లిదండ్రుల ఆగ్రహం
- అత్తిలిలో రోడ్డుపై బైఠాయించి నిరసన
- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, లైంగిక దాడి కేసుల నమోదు

అత్తిలి: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు అభం శుభం తెలియని చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడి పైశాచిక ఆనందం పొందుతున్న సంఘటన బల్లిపాడు గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. గ్రామంలో నంబర్–2 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోపిదేవి శ్రీనివాస నెహ్రూ గత కొంతకాలంగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెబితే చంపుతానని బెదిరించడంతో చిన్నారులు మిన్నకుండిపోయారు. నాలుగో తరగతి విద్యార్థినిని ఈ నెల 27న ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూ బాత్‌రూమ్‌కి తీసుకువెళ్లి విద్యార్థిని లైంగికంగా వేధించడంతో ఈ విషయాన్ని విద్యార్థిని ధైర్యంగా కుటుంబ సభ్యులకు తెలపడంతో సోమవారం స్థానికులు పాఠశాలను ముట్టడించారు. కీచక ప్రధానోపాధ్యాయుడికి తల్లిదండ్రులు దేహశుద్ధి చేశారు. తల్లిదండ్రులు, స్థానికులు ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలని కోరుతూ అత్తిలి పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. నిందితుడికి కఠిన శిక్ష అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మనుమరాలి వయస్సు ఉన్న విద్యార్థినులపై ఉపాధ్యాయుడు లైంగిక దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ దళిత సంఘాల నాయకులు ధర్నా చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితుడిని కఠినంగా శిక్షించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

ఎంఈవో విచారణ

ఈ ఘటనపై ఎంఈఓ రమేష్ పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. దీంతో మరో ఎనిమిది మంది విద్యార్థినులు తమతో కూడా అసభ్యంగా ప్రవర్తించారని ఎంఈఓకు దృష్టికి తీసుకురాగా, దీనిపై నివేదికను డీఈఓకు పంపారు.

బాధిత తల్లిదండ్రులతో మాట్లాడిన సీఐ

తణుకు రూరల్ సీఐ జీవీవీ నాగేశ్వరరావు అక్కడికి చేరుకుని ఉపాధ్యాయునిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులు రాస్తారోకో విరమించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని బాధిత తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. నిందితుడిపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, లైంగిక దాడి కేసులను నమోదు చేసి అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. అలాగే బాధిత విద్యార్థినులను వైద్యపరీక్షల నిమిత్తం తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించామని చెప్పారు.

హెచ్‌ఎం సస్పెన్షన్

భీమవరం: బల్లిపాడు నంబర్–2 పాఠశాల హెచ్‌ఎం పి.శ్రీనివాస నెహ్రూను సస్పెండ్ చేసినట్లు డీఈఓ ఆర్.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థినులతో అసభ్యంగా ప్రవరిస్తున్నాడని ఎంఈవో విచారణ చేసి ఇచ్చిన నివేదిక మేరకు అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేసి అత్తిలి పోలీస్‌స్టేషన్‌లో పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేయాల్సిందిగా ఎంఈవోను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై కఠినంగా వ్యవహరిస్తాం

తణుకు అర్బన్: గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తికి కళంకం తీసుకువచ్చిన కీచక ఉపాధ్యాయుడు మోపిదేవి నెహ్రూపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బల్లిపాడులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులపై పాఠశాల హెచ్‌ఎం మోపిదేవి నెహ్రూ అసభ్యకర ప్రవర్తన ఘటనకు సంబంధించి సోమవారం తణుకు ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యపరీక్షలకు తీసుకువచ్చిన విద్యార్థినులను, వారి తల్లిదండ్రులను మంత్రి కారుమూరి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుడి ముసుగులో మానవ మృగంగా ఉన్న ఉపాధ్యాయుడిని ఇప్పటికే సస్పెండ్ చేశారని, పోలీసు అధికారులు అతనిపై లైంగిక దాడి, పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు. రిటైర్ అవుతున్న వయస్సులో హెచ్‌ఎం నెహ్రూ మృగం కన్నా హీనంగా వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. పోలీసులు పెట్టిన కేసుల ప్రకారం ఆ మృగానికి జీవిత ఖైదు పడేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఇటువంటి నీచమైన ఆలోచనలు మరెవ్వరికీ రాకుండా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. బాధిత కుటుంబసభ్యులకు అండగా నిలబడతామని హామీ ఇచ్చారు. డీఎస్పీ శరత్‌రాజ్ కుమార్ మాట్లాడుతూ కేసుకు సంబంధించి ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని, చిన్నారుల తల్లితండ్రులు ధైర్యంగా బయటకు వచ్చి తమకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. చిన్నారులందరికీ వైద్యపరీక్షలు నిర్వహించామని, అందరూ క్షేమంగానే ఉన్నారని తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ తెలిపారు.

టెన్నికాయిట్‌లో పశ్చిమకు ద్వితీయ స్థానం

జంగారెడ్డిగూడెంలో ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

జంగారెడ్డిగూడెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో రెండు రోజుల పాటు నిర్వహించిన 67వ రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం, బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా జట్లు విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ సెక్రటరీ డి.రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో అండర్–19 విభాగంలో జరిగిన ఈ పోటీల్లో పూర్వ ఉమ్మడి జిల్లాల నుంచి మొత్తం ఎనిమిది జట్లు పాల్గొన్నాయి. తుది పోటీల్లో బాలుర విభాగంలో విజయనగరం జిల్లా ప్రథమస్థానం, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, శ్రీకాకుళం జిల్లా తృతీయ స్థానం సాధించాయి. అలాగే బాలికల విభాగంలో నెల్లూరు జిల్లా ప్రథమస్థానం, పశ్చిమగోదావరి జిల్లా ద్వితీయ స్థానం, విశాఖపట్నం జిల్లా తృతీయ స్థానాల్లో నిలిచాయి. సోమవారం విజేత జట్లను అభినందించి పతకాలను అందజేశారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో ‘పశ్చిమ’కు ప్రథమం

నారాయణపురంలో ముగిసిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు



అండర్ -19 హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పశ్చిమగోదావరి జట్టు

ఉంగుటూరు: పూర్వ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణపురంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–19 హ్యాండ్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా జట్టు విజేతగా నిలిచింది. ఆది, సోమవారాల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ పోటీలకు రాష్ట్రంలో 15 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీల్లో విశాఖ జట్టు ద్వితీయ స్థానం, నంద్యాల జట్టు తృతీయ స్థానాలు సాధించాయి. పోటీల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేస్తామని అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సి.శ్రీనివాస్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ చెప్పారు.

ఎట్టకేలకు సెల్ టవర్ నుంచి దిగివచ్చిన ఏసు

భీమవరం: భీమవరంలోని ఒక సెల్ టవర్‌పై గత 11 రోజులుగా దీక్ష చేస్తున్న లోకం ఏసు సోమవారం దీక్షను విరమించాడు. భీమవరం మండలం చినఅమిరం ప్రాంతానికి చెందిన లోకం ఏసు తన తండ్రికి సంబంధించిన బీమా పత్రాలు ఇవ్వాలని కోరుతూ సెల్ టవర్‌పైకి ఎక్కి నిరసన ప్రారంభించాడు. రోజులు గడుస్తున్నా కిందకి దిగి రాకపోవడంతో అతన్ని సురక్షితంగా కిందకు దించేందుకు అధికారులు ప్రయత్నాలు చేశారు. సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వడంతో ఏసు టవర్ దిగి వచ్చి దీక్షను విరమించాడు. ఆర్డీఓ కె.శ్రీనివాసులరాజు, డీఎస్పీ బి.శ్రీనాథ్, జిల్లా అగ్నిమాపక అధికారి కె.శ్రీనివాస్, తహసీల్దార్ వై.రవికుమార్ అతనికి నిమ్మరసం ఇచ్చి బంధువులకు అప్పగించారు.

బేతపూడిలో చోరీ

భీమవరం అర్బన్: బేతపూడిలోని ఓ ఇంట్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగి 11 కాసుల బంగారపు వస్తువులు అపహరణకు గురయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో లోకం వెంకట త్రిమూర్తులు తన ఇంటికి తాళం వేసి బెంగళూరులో ఉంటున్న తన కుమార్తె ఇంటికి ఇటీవల వెళ్లాడు. అయితే తన ఇంట్లో దొంగలు పడి దోచుకుంటున్నట్లు సోమవారం తెల్లవారుజామున బేతపూడి ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాల ద్వారా ఫోన్‌లో చూసి గుర్తించి తన తమ్ముడు లోక కృష్ణార్జునరావుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. అప్పటికే దొంగలు 11 కాసుల బంగారం, కొంత నగదును దొంగలు దోచుకుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారికి కానుకల పంట

32 రోజుల హుండీ ఆదాయం రూ.3.34 కోట్లు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలోని శ్రీవెంకటేశ్వరస్వామివారి దేవస్థానానికి రికార్డు స్థాయిలో ఆదాయం సమకూరింది. శ్రీవారి ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో గడచిన 32 రోజులకు నగదు రూపేణా స్వామివారికి రూ.3,34,81,330 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 418 గ్రాముల బంగారం, 14.660 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2వేలు, రూ.వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.2,37,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



ఆరుగొలను గ్రామంలో దోమల నివారణ మందు పిచికారికి సిద్ధమైన పారిశుద్ధ్య కార్మికులు

తాడేపల్లిగూడెం రూరల్: దోమలతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ చర్యలు చేపడుతున్నట్లు ఆరుగొలను సర్పంచ్ పీతల బుచ్చిబాబు తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఆరుగొలను గ్రామంలో దోమల నివారణ మందు పిచికారి కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ ఎనిమిదిమంది సిబ్బందిని ఏర్పాటుచేసి, దోమల మందు పిచికారి చేయిస్తున్నామన్నారు. ఆయనను ప్రజలు పలువురు అభినందించారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్ పరీక్ష



వాసవీలో జేఈఈ పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థినులు

తాడేపల్లిగూడెం: సాంకేతిక విద్యాసంస్థల్లో ప్రవేశానికి దేశ వ్యాప్తంగా నిర్వహించే జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష సోమవారం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం జరిగాయి. 221 మంది విద్యార్థులు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్‌రావు, పరీక్షా కేంద్రం కో ఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టీసీఎస్ సంస్థ ప్రతినిధులు ఆధ్వర్యంలో ఈ పరీక్షలను నిర్వహించారు.

విద్యార్థినులకు ప్రభుత్వం తరపున న్యాయం చేస్తాం



అత్తిలి పోలీస్ స్టేషన్ వద్ద బాధిత తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వేణుమాధవరెడ్డి

అత్తిలి: బల్లిపాడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూ విద్యార్థుల పట్ల అసభ్య ప్రవర్తనపై రాష్ట్ర విద్య,మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్, రాష్ట్ర యువజన కార్యదర్శి కొవ్వూరి వేణుమాధవరెడ్డి విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా విద్యార్థినులను సెల్‌ఫోన్‌లో వీడియోలు చూపించి అసభ్యంగా ప్రవర్తిస్తున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువు ఇలాంటి దారుణానికి పాల్పడటం దురదృష్టకరమన్నారు. ఈ సంఘటనలో ప్రధానోపాధ్యాయుడునిపై జిల్లా విద్యాశాఖాధికారి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. హెచ్‌ఎంపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని, విద్యార్థినులకు ప్రభుత్వం తరపున న్యాయం జరిగేలా కృషిచేస్తానని వేణుమాధవరెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



7వార్డులో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోట రాంబాబు కోరారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పట్టణంలో సోమవారం 7,8,9 వార్డుల్లో లబ్ధిదారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మోదీ పేద ప్రజలకి, బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులో ఉండాలని పలు పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలందరికి ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, ఉపాధి హామీ పథకం, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, విశ్వకర్మ యోజన, తదితర కేంద్ర పథకాలను వివరించారు. కో-కన్వీనర్ రామగాని సత్యనారాయణ, ముప్పిడి సురేష్ రెడ్డి, వన్నేంరెడ్డి నవీన్, అడప రమేష్, రాజా, వెంకటేశ్వరరావు, ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలకు తణుకు ముస్తాబు

తణుకు: గీత కార్మిక రాష్ట్ర మహాసభలకు తణుకు పట్టణం ముస్తాబైంది. మంగళ, బుధ వారాల్లో తణుకు లయన్స్ క్లబ్ ఆవరణలో జరిగే రాష్ట్ర మహాసభలకు రాష్ట్రవ్యాప్తంగా సుమా రు 400 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆహ్వాన కమిటీ అధ్యక్షుడు కామన మునిస్వామి తెలిపారు. ఈ సందర్భంగా తణుకులోని ప్రధాన కూడళ్లలో తాడిచెట్లు ఏర్పాటు చేసి వినూత్నంగా అలంకరించారు. మంగళవారం గీత కార్మికులు మోకులు కట్టుకుని మున్సిపల్ కార్యాలయం నుంచి లయన్స్ క్లబ్ వరకు ప్రదర్శన అనంతరం మహా సభ జరుగుతుందన్నారు.

శాటిలైట్ సిటీలుగా జగనన్న కాలనీలు

- మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు
- పైడిపర్రులో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



పైడిపర్రులో 3.30 కోట్లతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు టౌన్: రాష్ట్రంలో పేదలకు ప్రభుత్వం నిర్మించిన జగనన్న కాలనీలు భవిష్యత్‌లో అన్ని సౌకర్యాలతో శాటిలైట్ సిటీలుగా అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని జగనన్న కాలనీలో రూ.3.30 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ఒక్క ఇంటిని కూడా నిర్మించలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా రాష్ట్రంలోని 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించడమే కాక ఇళ్లు నిర్మించారన్నారు. జగనన్న కాలనీలను విమర్శించిన టీడీపీ నాయకులు ఇప్పుడు వాటిని చూడాలన్నారు. ప్రభుత్వం జగనన్న కాలనీల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. పైడిపర్రులో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ వలన పైడిపర్రు, మండపాక గ్రామాల్లోని జగనన్న కాలనీలలో ఇళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. దీని వలన పట్టణంలోని సబ్‌స్టేషన్‌కు విద్యుత్ లోడు భారం తగ్గి లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సదుపాయాలను కల్పించామని చెప్పారు. ఈ సందర్భంగా సబ్‌స్టేషన్ ఆవరణలో స్విచ్ ఆన్ చేసి లైట్లు వెలిగించారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, ఎంబీసీ చైర్మన్ పెండ్రా వీరన్న, నాయకులు బోడపాటి వీర్రాజు, నియోజకవర్గ పరిశీలకుడు జక్కంశెట్టి సత్యరాజేంద్ర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, బీ భరణీ ప్రసాద్, వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ సచివాలయాల జేసీఎస్ చైర్మన్ ఇందుగపల్లి బలరామ్, ఎంపీపీ రుద్ర ధనరాజు, పైబోయిన సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ జానా వెంకట లక్ష్మీ, సొసైటీ అధ్యక్షురాలు వై.విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, విద్యుత్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు, డీఈఈ సీహెచ్ రామకృష్ణ, ఏఈ టీ పెద్దిరాజు, ఎంపీటీసీ కాళ్ల సన్యాసిరావు, నాయకులు పాల్గొన్నారు.

త్రిఫుల్‌ఎఫ్ కర్మాగారానికి జిల్లా ప్రత్యేక అవార్డు



జిల్లా కలెక్టర్ ప్రశాంతి చేతుల మీదుగా ప్రత్యేక అవార్డు తీసుకొంటున్న త్రిఫుల్ కర్మాగార ప్రతినిధులు

పెంటపాడు: ప్రత్తిపాడు త్రిఫుల్ కర్మాగారానికి సామాజిక బాధ్యతల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ద్వారా అవార్డు దక్కింది. ఆ వివరాలను ప్రత్తిపాడు త్రిఫుల్ ఏజీఎం జి. శ్రీనివాసరెడ్డి సోమవారం వివరించారు. రిపబ్లిక్ డే వేడుకలు పురస్కరించుకొని కర్మాగారాలు సామాజిక సేవలకు ఇచ్చే ప్రత్యేక అవార్డుల్లో భాగంగా త్రిఫుల్ కర్మాగారానికి ఈ అవార్డు దక్కింది. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి చేతుల మీదుగా ప్రతినిధులు ఆ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఆర్ జీఎం జనార్థన్, స్వాభిమాన్ ట్రస్టు, త్రిఫుల్ కర్మాగార ప్రతినిధులు, పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

రాష్ట్ర మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మండపాకలో డ్వాక్రా మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు టౌన్: ప్రజా సంకల్ప పాదయాత్రలో మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని నాలుగు విడతలుగా అమలు చేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించారని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలతో మాట్లాడారు. డ్వాక్రా సంఘాలకు కేంద్రం ద్వారా అందే పథకాలను అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం గ్రామంలో ప్రజా దీవెన పాదయాత్ర, గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని చెప్పారు. నాడు-నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలు తీర్చిదిద్దామన్నారు. విద్యారంగంలో దేశంలో ఏపీ నెంబర్1 నిలిచిందన్నారు. గ్రామాల్లో మంచి పనులు చేస్తుంటే ప్రతిపక్ష నాయకులు అడుగడుగునా అడ్డుపడుతున్నారన్నారు. గ్రామంలో పేద ప్రజలకు ఉపయోగపడే పనులను ప్రతిపక్ష నాయకులు అడ్డుకోవడం మానుకోవాలన్నారు. మండపాక గ్రామంలో గత టీడీపీ ప్రభుత్వం రూ.13కోట్ల విలువైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందజేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఈ నాలుగేన్నరేళ్లలో రూ.75కోట్ల సంక్షేమ, అభివృద్ధి పథకాలను అందజేశామన్నారు. అనంతరం జగనన్న కాలనీలో నూతనంగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారికి కరపత్రాలు అందజేశారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ప్రజలకు మంచి చేస్తుంటే ప్రతిపక్షనేత చంద్రబాబు ఓర్వలేక రాష్ట్రంలో కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ గుబ్బల తమ్మయ్య, రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్రా వీరన్న, నాయకులు బోడపాటి వీర్రాజు, రాజేంద్రప్రసాద్, తణుకు ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, భరణీ ప్రసాద్, పైబోయిన సత్యనారాయణ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్య అభ్యసించడం అభినందనీయం



కడియద్ద గ్రామంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న వక్తలు

తాడేపల్లిగూడెం రూరల్: యువత వ్యవసాయ విద్యను అభ్యసించడం అభినందనీయమని ఎమ్మెల్సీ దారపురెడ్డి శ్రీనివాస్ అన్నారు. పార్వతీపురం ఉద్యాన కళాశాలకు చెందిన విద్యార్థినులు సోమవారం మండలంలోని కడియద్ద గ్రామంలో గ్రామీణ ఉద్యాన కృషి అవగాహన, అనుభవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సాంకేతిక విద్యతో పాటు వ్యవసాయ అనుబంధ విద్యపై దృష్టి సారించాలన్నారు. పార్వతీపురం ఉద్యాన కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు ఉద్యాన విభాగంపై ఆచరణాత్మక జ్ఞానం తెలుసుకునేందుకు గ్రామ రైతులు, సిబ్బంది సహకరించాలన్నారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ టి.నాగలక్ష్మి మాట్లాడుతూ జీవన ఎరువులు, ఉద్యాన పరిశోధన స్థానం ద్వారా అందించే సౌకర్యాలు, విలువైన సమాచారాన్ని తెలియజేశారు. ఉద్యాన కళాశాలకు చెందిన బి.సుజాత, డాక్టర్ పి.అశోక్, శాస్త్రవేత్తలు డాక్టర్ బి.రమేష్‌బాబు, డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ టి.థామ్సన్, ఎన్‌వి.గౌతమ్ దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రత్తిపాడు ఏఎస్సార్ కళాశాలలో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

పెంటపాడు: క్రీడలతోనే మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని, విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డాక్టర్ వైఎస్సార్ యూనివర్శిటీ హెల్త్ సైన్స్ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ ఇ. త్రిమూర్తి, ఏఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఆకుల విజయవర్ధన్‌లు పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాల ప్రాంగణంలో వైఎస్సార్ వైద్య వర్శిటీ అంతర కళాశాల విద్యార్థులు క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. బాడ్మింటన్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, చెస్ పోటీలు జరిగాయి. తొలుత పోటీలకు వచ్చిన పలు జిల్లాల కళాశాలల విద్యార్థుల ఆధ్వర్యంలో మార్చ్‌పాస్ట్ జరిగింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఈ పోటీలు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో ప్రత్యేక క్రీడాశక్తి పెంపొందుతుందన్నారు. వైఎస్సార్ యూనివర్శిటీ పరిధిలో విద్యార్థులకు తమ ప్రాంగణంలో క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ క్రీడా పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రకుమార్, ఏఎస్సార్ హోమియో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ యుఎస్‌వీ ప్రసాద్, శ్రీనివాస రాజు, ఆశ్రం మెడికల్ కళాశాల శ్రీనివాస్, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల నల్లయ్య, సెంట్‌జోసఫ్ కళాశాల ప్రతినిధులతో పాటు, స్థానిక హోమియో కళాశాల అధ్యాపక, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ తదితర వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న వైద్య బృందం

తణుకు అర్బన్: దోమ పుట్టుకకు కారకమయ్యే నీటి నిల్వలు, పనికిరాని సామాగ్రిని గుర్తించి నిర్మూలించాలని తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం తణుకు మున్సిపాలిటీ పరిధిలోని వంగవీటి మోహనరంగా వీధి, రత్న నర్సింగ్ హోం ప్రాంతంలో కీటకజనిత వ్యాధులపై వార్డు హెల్త్ సెక్రటరీలు, ఆశ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యంగా డెంగ్యూ వ్యాధిని కలుగచేసే ఏడిస్ దోమ చిన్న నీటి నిల్వల్లో గుడ్లు పెడుతుందని, ఆ గుడ్లు రోజుల వ్యవధిలోనే దోమలుగా మారతాయని హెచ్చరించారు. అందుచేత దోమల వ్యాప్తిని నిరోధించగలిగితే డెంగ్యూతోపాటు మరిన్ని వ్యాధులను నియంత్రించవచ్చని అన్నారు. అనంతరం వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ కె.అనుషా సువర్ణ, హెల్త్ అసిస్టెంట్స్, వలంటీర్లు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు పట్టాల పంపిణీ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని 25, 7వ వార్డుల్లో సోమవారం టిడ్కో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. పార్టీ పట్టణాధ్యక్షుడు తోట భోగయ్య, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్ మాట్లాడుతున్న దేశంలోనే పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్కిందన్నారు. లక్షలు విలువ చేసే టిడ్కో ఇళ్లను పేదలకు ఉచితంగా అందించి వారికి భరోసా కల్పించారన్నారు. భీమవరంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టిడ్కో ఇళ్లకు సంబంధించి నిర్మాణాలను వేగంగా పూర్తి చేయించి లబ్ధిదారులకు అందజేయడంలో ఎంతో కృషి చేశారన్నారు. రెండు విడతలుగా ఆయన 5,800 ఇళ్లు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ గంటా సుందర్ కుమార్, మాజీ కౌన్సిలర్ వాసర్ల ముత్యాలరావు, చెల్లబోయిన సూర్యప్రకాష్, పోతుల జక్రీ, కోనాల బన్ను, కండిపల్లి గుర్నాథ్, విపర్తి సత్యవేణి, లూషిఫర్, విజయలక్ష్మి, శాంతికుమార్, మధు, పత్తివాడ శేషు, బాలం శ్రీను, వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

నరసాపురం రూరల్: విద్యార్థి దశ నుంచే వృత్తినైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలని సరిపల్లి సర్పంచ్ ఈదా సురేష్‌బాబు, ఎంపీటీసీ చిన్నం వెంకట్రావు అన్నారు. సోమవారం నరసాపురం మండలం సరిపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 18 మంది 8వ తరగతి విద్యార్థులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం సమకూర్చిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గమిడి మధుబాబు, మైలాబత్తుల కృష్ణంరాజు, కేదాసు శోభనరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న ఎంవీఐ సంజీవ్‌కుమార్

తణుకు: ఇటీవలి కాలంలో జరుగుతున్న ప్రమాదాలు మానవ తప్పిదాలు కారణంగానే అత్యధిక శాతం జరుగుతున్నాయని తణుకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌కుమార్ పేర్కొన్నారు. 35వ జాతీయ భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని సోమవారం తణుకులోని లారీ యూనియన్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముఖ్యంగా డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ముఖ్యంగా ప్రమాద సూచికలపై ప్రతిఒక్కరూ అవగాహన కల్పించుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లే లారీ డ్రైవర్లు తమ ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షించుకోవాలని సూచించారు. ఏకధాటిగా డ్రైవింగ్ చేయకుండా విశ్రాంతి తీసుకుంటూ ప్రయాణం కొనసాగించాలని ఎంవీఐ కోరారు. లారీ డ్రైవర్లతో పాటు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

పాలకోడేరు: రెండు వేర్వేరు చోట్ల కోడి పందేలు ఆడుతున్న వారిపై దాడి చేసి, పది మందిపై కేసులు నమోదు చేసినట్లు పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం గొల్లలకోడేరులో దాడి చేసి రూ.56,000 స్వాధీనం చేసుకుని, ఆరుగురిపై, బంటుమిల్లిలో దాడి చేసి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ఆహారం.. ఆరోగ్యం



జగనన్న ఆరోగ్య సురక్షలో మందులు అందజేస్తున్న దృశ్యం

- పౌష్టికాహారంతోనే పరిపూర్ణ ఆరోగ్యం
- జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు
- పోషకాహార ప్రదర్శనను ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు
- మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు

పెంటపాడు: ప్రజలకు పౌష్టికాహారంపై అవగాహన పెరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు ప్రత్యేక సదస్సులు, కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలకు అనారోగ్యంతో వచ్చే వారికి డాక్టర్లు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తుండగా..మరో పక్క అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న పౌష్టికాహార స్టాల్స్ ఆకట్టుకుంటున్నాయి. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార ప్రాధాన్యం గురించి వివరిస్తున్నారు. ప్రతి సురక్ష శిబిరంలోనూ పలు రకాల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు, చిరుధాన్యాలు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు

గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రదర్శిస్తున్నారు. వీటిలో రెండు కిలోల రాగి పిండి, కిలో అటుకులు, పావు కిలో వంతున బెల్లం, ఖర్జూరం, వేరుశనగ చక్కీలు ఉన్నాయి. వీటితో పాటు ఐసీడీఎస్ తరపున అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అదనపు ఆహారంగా మూడు కిలోల పోషక విలువలు కలిగిన బియ్యం 3కిలోలు, 1లీటరు నూనె, 5లీటర్ల పాలు, 25కోడి గుడ్లు, పిల్లలకు ఆహారంగా బాలామృతం ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు.

పప్పు దినుసులు, కూరగాయలతో ఆహారం

తల్లీ, శిశువుకు మరిన్ని ప్రోటీన్ విలువలతో కూడిన పెసలు, ఉలవలు, వేరుశనగ, బొబ్బర, కొమ్ము శెనగలు, మినుములు వంటి పప్పు దినుసులు అందిస్తున్నారు. వాటితో పాటు బియ్యానికి ప్రత్యామ్నాయమైన కొర్రలు, రాగులు, సజ్జలు, జొన్నలు, సామలు, ఎర్ర గోధుమ వంటి చిరుధాన్యాలు, సి విటమిన్, ఆరోగ్యాన్ని అందించే జామ, ద్రాక్ష, బత్తాయి, బొప్పాయి, నిమ్మ, సీతాఫలం తదితర పండ్లు, పోషక విలువలు కలిగిన మొక్కజొన్న, వంకాయ, టమాటా, క్యారెట్, బీట్‌రూట్, మునగ, కాకర వంటి కూరగాయలను వినియోగించడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని చెబుతున్నారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచె తోటకూర, పాల కూర, బచ్చలి, గోంగూర, మునగ, పుదీనా కొత్తి మీర తదితర ఆకుకూరలను ప్రదర్శించి అవగాహన కల్పిస్తున్నారు.

ఆహా...ఏమి రుచి

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పోషకాహార స్టాల్స్‌లో పులిహోర, బాలామృతంతో తయారు చేసే లడ్డూ, బిస్కెట్లు, గులాజీ పువ్వులు, కేకు ఆవిరి కుడుములు, రాగి పిండితో తయారు చేసిన హల్వా, పకోడి, జంతికలు, అంబలి, రాగి సంకటి, ఉలవ ఉండలు, పాలతో తయారు చేసే జున్న తదితర వంటకాలను అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసి ప్రదర్శిస్తున్నారు. ప్రదర్శనను తిలకించడానికి వచ్చే బాలింతలు, గర్భిణులకు వీటి ఆవశ్యకతను వివరించి, వాటిని రుచి చూపించడంతో పాటు తయారీ విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

4న బీవీఆర్‌లో నెలవారీ సంగీత, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీవీఆర్ కళా కేంద్రంలో ఫిబ్రవరి 4వ తేదీన ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు సభాధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. కళాకారులచే ట్రాక్ సింగింగ్, చిన్నారులచే నృత్య ప్రదర్శనలు, సభ, సత్కార కార్యక్రమాలు ఉంటాయని, జాతీయ యువజన అవార్డు గ్రహీత గురజాడ ఆనంద్‌కు గౌరవ పురస్కారం, నాట్య శిరోమణి పంతం శిరీషకు నాట్యరత్న పురస్కారం, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతికి సాహితీరత్న పురస్కారం, మేకప్ ఆర్టిస్ట్ పరమేష్‌కు ఆర్థిక సత్కారం చేయనున్నట్లు వివరించారు. కళాకారులు, పట్టణ ప్రముఖులు, సాహితీ సభ్యులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన

భీమవరం: భీమవరం టుటౌన్ రైల్వేస్టేషన్‌లో సోమవారం రైల్వే ప్రయాణికుల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే ఎస్సై పీటీవీ రమణ మాట్లాడుతూ రైలులో ప్రయాణించే సమయంలో రైలు ఎక్కే,, దిగే సమయాల్లో అత్యంత జాగ్రతగా ఉండాలన్నారు. రైలు కదులుతుండగా ఎక్కడం, దిగడం ప్రమాదకరమని చెప్పారు. ప్రయాణికులు తమ విలువైన వస్తువులను భద్రపర్చుకోవాలన్నారు.